నీ మూర్తికే శతకోటి ప్రణామం

- విభిన్న రూపాల్లో కొలువుదీరిన గణనాథుడు
- వాడవాడలా వైభవంగా ఉత్సవాలు

బొజ్జ గణపయ్య విభిన్న రూపాల్లో కొలువు దీరాడు. పార్వతీదేవి చేతిలో పిండిబొమ్మగా రూపుదిద్దుకుని, ఈశ్వరుడి అనుగ్రహంతో గజాననుడిగా మారిన గణపతిని కళాకారులు చూడచక్కగా తీర్చిదిద్దారు. విజ్ఞానికి ప్రతీకగా.. విఘ్నాలను తొలగించే విఘ్నాధిపతిగా తొలిపూజలందుకునే స్వామి పందిళ్ల ఏర్పాటులో యువతదే సందడి. లంకా మైదానంలో 117 అడుగుల పంచముఖ గణపతిగా, గ్లోబెక్స్ సమీపంలో 112 అడుగుల ఆయుష్ గణనాథుడిగా.. వేంకటేశ్వరుడిగా.. సకల దేవతా సమేతుడై షణ్ముఖ సోదరుడు దర్శన మిచ్చాడు. చంద్రయాన్ తరహా వినూత్న సెట్టింగ్స్ ఆకట్టుకున్నాయి.


వుడా కాలనీలో చంద్రయాన్-3 సెట్‌లో ఆకట్టుకుంటున్న విఘ్నేశ్వరుడు


లంకా మైదానంలో పంచముఖ మహాగణపతి సన్నిధిలో ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

గాజువాక: గణేశ్ ఉత్సవాలు గాజువాకలో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా అగ్ని ప్రతిష్ఠాపన, లక్ష్మీ గణపతి హోమం, మంగళా శాసనాలు, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం నిత్య పూజ, అష్టోత్తర పూజ అనంతరం ప్రసాద వితరణ చేశారు.

- ఎస్‌వీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో పాతగాజువాక లంకా మైదానంలో ఏర్పాటు చేసిన 117 అడుగుల పంచముఖ మహాగణపతి విగ్రహాన్ని సోమవారం ఘనంగా ప్రతిష్ఠించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి దంపతులు, బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు దంపతులు తొలిపూజ చేసి ఉత్సవాలను ప్రారంభించారు. రాష్ట్రంలోనే పెద్ద విగ్రహం కావడంతో భక్తులు ఆసక్తిగా వస్తున్నారు. స్టాల్స్‌లో పూజా సామగ్రి అందుబాటులో ఉంచారు. 21 రోజులపాటు ఉత్సవాలను నిర్వహించనున్నట్టు ఉత్సవ నిర్వాహకుడు కొసిరెడ్డి గణేష్ కుమార్ తెలిపారు. భారీ గణపతిని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సహా పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

ఆకట్టుకుంటున్న విగ్రహాలు

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన గణపతి విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. నిర్వాహకులు వర్తమాన పరిస్థితుల కనుగుణంగా ఏర్పాటు చేసిన విగ్రహాలపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వుడా కాలనీలో చంద్రయాన్-3 ఆకారంలో ప్రతిష్ఠించిన విగ్రహం, కణితి రోడ్‌లో వేంకటేశ్వరస్వామి నమూనాలో ఏర్పాటు చేసిన విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి

'ఆయుష్' గణపతికి విశేష పూజలు

అక్కిరెడ్డిపాలెం: గ్లోబెక్స్ పక్కనున్న సీఎంఆర్ స్థలంలో 112 అడుగుల భారీ ఆయుష్ గణపతి ఆకట్టుకుంటున్నాడు. స్వామికి విశేష పూజలు చేశారు. 68వ వార్డు మిందిలో విఘ్నేశ్వరుడి పూజల్లో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, భార్య హిమబిందు, తల్లి గుడివాడ నాగమణి, కుమార్తెలతో కలిసి పాల్గొన్నారు. 69వ వార్డు నాతయ్యపాలెంలో జరిగిన వేడుకల్లో గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి పాల్గొని విఘ్నేశ్వరుడికి పూజలు చేశారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా ఫుడ్ విజిలెన్స్ కమిటీ మెంబర్ బోగాది సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: 75వ వార్డు నెల్లిముక్కు ధర్మాల వీధిలో శ్రీ పెంటమాంబ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో వరసిద్ధి వినాయక మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొలిపూజలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో కరణంరెడ్డి నరసింగరావు, కాతా బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- 76వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో యువ క్రాంతి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో, నడుపూరులో వాల్మీకి యువజన సంఘం ఆధ్వర్యంలో, విశ్వ బ్రాహ్మణ యువజన సంఘం ఆధ్వర్యంలో కొలువుదీరిన గణనాథుడి విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ, మంత్రి శంకరనారాయణ పాల్గొన్నారు.
- 74వ వార్డులో కొలువుదీరిన గణనాథులను కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పండరీపురం పాండురంగడిగా..

అగనంపూడి: 85వ వార్డు పినమడకకు చెందిన కొప్పాక రమేష్ ఈ ఏడాది పండరీపురం పాండురంగస్వామిగా విఘ్నాధిపతిని ఏర్పాటు చేశారు. రమేష్ పదేళ్లుగా వినాయక చవితి, దేవీ నవరాత్రులను సొంత నిధులతో తాను నివాసముంటున్న వీధిలో నిర్వహిస్తున్నారు.

కూర్మన్నపాలెం: 87వ వార్డు కణితి కళింగవీధి రామాలయంలో వినాయక ఉత్సవాలను ఎమ్మెల్యే నాగిరెడ్డి తొలిపూజ చేసి ప్రారంభించారు. ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద్, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, మహిళలు పాల్గొన్నారు. లక్ష్మీపురం కాలనీలో దుర్గ యువసేన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో దువ్వాడ సీఐ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. జాజుల శ్రీను, విజయ్, బుజ్జి, గోపిశెట్టి భీమా తదితరులు పాల్గొన్నారు.

- 86వ వార్డులోని ఉత్సవాలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి దామా సుబ్బారావు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. పాత కూర్మన్నపాలెంలోని రామాలయం సమీపంలో ఏర్పాటు చేసిన విగ్రహం భక్తులను ఆకట్టుకుంటోంది. వార్డు అధ్యక్షుడు వెలుగుల పరశురాముడు, చేగొండి శ్రీను, శ్రీనివాస పట్నాయక్, చిట్టి దేముడు, మాటూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మిందిలో వినాయక చవితి పూజల్లో కుటుంబ సమేతంగా పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్


నడుపూరు వాల్మీకి వీధిలో..

స్టీల్‌ప్లాంట్ సెక్టార్లలో..

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సెక్టార్-1లో సత్యసాయి సేవా కేంద్రంలో వినాయక చవితి పూజలు చేశారు. బాల వికాస్ చిన్నారులతో పాటు అనాథ బాలలు చేసిన మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు. సెక్టార్-1 కాంప్లెక్స్ సిద్ధి వినాయక సంఘం ఆధ్వర్యంలో, ట్రివీక్లీ వర్తకుల ఆధ్వర్యంలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు.

- సెక్టార్-4 కాంప్లెక్స్‌లో వర్తకులు, ఉద్యోగులు ఏర్పాటు చేసిన వినాయకుడికి పూజలు చేశారు. సెక్టార్-5 జై గణేష్ పూజా కమిటీ ఆధ్వర్యంలో వినాయకుడి విగ్రహానికి వర్తకులు విశేషార్చనలు చేశారు.
- సెక్టార్-11 కాంప్లెక్స్‌లో ప్రతిష్ఠించిన విగ్రహానికి ప్రజలు పూజలు చేశారు.


సెక్టార్-6 కాంప్లెక్స్‌లో వినాయక మండపం వద్ద మహిళల కోలాటం


కణితి రోడ్‌లో వేంకటేశ్వరస్వామిగా..


పూజల్లో పాల్గొన్న గురుమూర్తిరెడ్డి, దేవన్ తదితరులు

- సెక్టార్-6 షాపింగ్ కాంప్లెక్స్‌లో సిద్ధి వినాయక పూజా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ విశేషంగా ఆకట్టుకుంటోంది. మహిళల కోలాట ప్రదర్శన అలరించింది.


రాజీవ్‌నగర్ వుడా ఎల్ఐజీ అపార్ట్‌మెంట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



హౌసింగ్ బోర్డు కాలనీలో ..


కణితిలో తల్లిదండ్రులతో కొలువుదీరిన బొజ్జ గణపయ్య


గ్లోబెక్స్ పక్కన సీఎంఆర్ స్థలంలో 112 అడుగుల ఆయుష్ గణపతి


పాత కూర్మన్నపాలెంలో ఆకట్టుకుంటున్న వినాయకుడు


85వ వార్డులో పండరీపురం పాండురంగస్వామిగా


87వ వార్డు లక్ష్మీపురంలో..


సిద్ధేశ్వరంలో..


సెక్టార్-11 కాంప్లెక్స్‌లో..


సెక్టార్-5 కాంప్లెక్స్‌లో..

క్లుప్తంగా

నిమజ్జనోత్సవాలపై పోలీసుల అప్రమత్తం


యారాడ తీరంలో లైఫ్ గార్డులకు సూచలిస్తున్న న్యూపోర్టు సీఐ రాము

పెదగంట్యాడ: వినాయక నిమజ్జనోత్సవాలపై న్యూపోర్టు, దువ్వాడ పోలీసులు అప్రమత్తమయ్యారు. నిమజ్జనోత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా యారాడ, అప్పికొండ తీరాల్లో న్యూపోర్టు, దువ్వాడ పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. తీరాల్లో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశామని, ప్రత్యేకంగా లైటింగ్ సదుపాయం కల్పిస్తున్నామని పోలీస్ అధికారులు తెలిపారు. సముద్రం లోతుగా ఉన్న ప్రాంతాల్లోకి వెళ్లకుండా బారికేడ్లు నిర్మిస్తున్నామని తెలియజేశారు. న్యూపోర్టు సీఐ సువ్వారి రాము, దువ్వాడ సీఐ బి. శ్రీనివాసరావు సారథ్యంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

రాజశేఖర్‌కు మంత్రి అమర్‌నాథ్ పరామర్శ


రాజశేఖర్‌ను పరామర్శిస్తున్న మంత్రి అమర్‌నాథ్

ఉక్కునగరం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్‌ను రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పరామర్శించారు. నగరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజశేఖర్‌ను ఆయన కలిసి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

స్టీల్ ఏఐసీటీయూ ప్రధాన కార్యదర్శి కృష్ణారావు మృతి


కృష్ణారావు (ఫైల్)

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ ఏఐసీటీయూ ప్రధాన కార్యదర్శి నేతేటి కృష్ణారావు (57) మృతి చెందారు. ట్రాఫిక్ విభాగంలో జనరల్ ఫోర్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న కృష్ణారావుకు గత నెలలో గుండెకు శస్త్రచికిత్స జరిగింది. అప్పటి నుంచి అనారోగ్యంగా ఉన్న కృష్ణారావు సోమవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ విషయం తెలిసి ఏఐసీటీయూ అధ్యక్షుడు చిత్రాడ సన్యాసిరావు, సీఐటీయూ నాయకులు జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు దొమ్మేటి సన్యాసి రావు ఆస్పత్రికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సాయంత్రం ఆయన స్వస్థలం జామిలో అంత్యక్రియలు జరిగాయి.

ప్రధాన కాలువ, కల్వర్టు పరిశీలన


ప్రధాన కాలువ పరిశీలిస్తున్న కార్పొరేటర్ నరసింహపాత్రుడు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు భానోజీతోటలో ప్రధాన కాలువ, కల్వర్టులను కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు మంగళవారం పరిశీలించారు. కల్వర్టు శిథిలావస్థకు చేరుకోవడంతో కాలువ ద్వారా మురుగు నీరు వెళ్లక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై స్థానికుల నుంచి ఫిర్యాదులు అందడంతో జీవీఎంసీ అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. నిర్మాణానికి అడ్డంకిగా ఉన్నవాటిని తొలగించి వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మద్దాల అప్పారావు, మంగునాయుడు, అర్జున్ పాల్గొన్నారు.

950వ రోజుకు 'ఉక్కు' దీక్షలు


దీక్ష శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు కార్మికులు చేస్తున్న ఉద్యమం వారి పోరాట శక్తికి నిదర్శనమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉద్యమంలో ప్రజలను భాగస్వాములను చేసి మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 950వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహనీయుల త్యాగఫలంగా ఏర్పాటైన ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడం కోసం ఎలాంటి పోరాటానికైనా, ఆఖరికి ప్రాణత్యాగానికైనా సిద్ధమన్నారు. ప్రధాని మోదీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై దేశంలోని కార్మికులందరం ఏకమై పోరు సాగిస్తామన్నారు. ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందని, కర్మాగార పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' పై వలంటీర్లకు శిక్షణ


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న పల్లా చినతల్లి

గాజువాక: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతం చేయడం కోసం 67వ వార్డులో వలంటీర్లకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పల్లా చినతల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య పథకాలను ఎలా పొందాలో ప్రజలకు వివరించడంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై కూడా సర్వే నిర్వహించాలని సూచించారు. ఈ నెల 30 నుంచి నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు ఉపయోగించుకునే విధంగా అందరికీ తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ క్లస్టర్-3 అధ్యక్షుడు ఎస్.ఎం.డి.గౌస్, సచివాలయ కన్వీనర్లు అన్నపూర్ణ, అన్వర్, షాహిద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రామాలయంలో సీసీ కెమెరాలు ప్రారంభం


సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న సీఐ శ్రీనివాసరావు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అండమాన్ కొండయ్యవలసలోని రామాలయంలో ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను దువ్వాడ సీఐ శ్రీనివాసరావు ప్రారంభించారు. గ్రామానికి చెందిన బాలగణపతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆలయాల్లో హుండీల చోరీల నేపథ్యంలో భద్రతా చర్యల దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరడంతో సురేష్ గుప్తా స్పందించి ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. గ్రామ నాయకులు నెల్లి శ్రీనివాసరావు, విందుల వెంకటరమణ, తోకాడ రాము, బలిరెడ్డి సత్యనారాయణ, దానబాల పైడికొండ పాల్గొన్నారు.

నేడు అన్న సమారాధన

ఉక్కునగరం: స్థానిక సెక్టా-6 షాపింగ్ కాంప్లెక్స్‌కు చెందిన సిద్ధి వినాయక పూజా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో మధ్యాహ్నం ఏర్పాటు చేస్తున్న సమారాధనకు ఉక్కు ఉద్యోగులు కుటుంబ సభ్యులతో హాజరు కావాలని పూజా కమిటీ ప్రతినిధులు కోరారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు నేటి నుంచి బైక్ యాత్ర


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం నిర్వహించనున్న బైక్ యాత్రను జయప్రదం చేయాలని స్టీల్ ప్లాంట్ కోక్‌ఓవెన్స్ కార్మిక నాయకులు కోరారు. మంగళవారం విభాగంలో జరిగిన కార్యక్రమంలో బైక్ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో బైక్ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 20న నగరంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం దరి దీక్ష శిబిరం వద్ద ప్రారంభమైన యాత్ర 29న కూర్మన్నపాలెం దీక్ష శిబిరానికి చేరనుందని తెలియజేశారు. ఆ రోజు నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు టి.వి.కె. రాజు, కనకరాజు, రమణాజీ, భాస్కరరావు, రామారావు, కొమ్ముప్రసాద్, సుబ్బారావు, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేదీప్యమానం


డెయిరీ కాలనీలో దీపారాధన చేస్తున్న మహిళలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని పిండిమిల్లు పక్కనున్న డెయిరీ కాలనీలో వినాయక చవితి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి వరసిద్ధి వినాయకుడి సన్నిధిలో కాలనీలో మహిళలు 501 ప్రమిదలతో ఓం, గణేశుడు, శివలింగం ఆకృతిలో రంగవల్లులను తీర్చిదిద్ది దీపారాధన నిర్వహించారు.

దోమల నివారణకు మెగా ఫాగింగ్

అక్కిరెడ్డిపాలెం: దోమల నివారణకు మెగా ఫాగింగ్ నిర్వహిస్తున్నట్లు జెడ్సీ సింహాచలం తెలిపారు. హరిజన జగ్గయ్యపాలెం, వెంకటేశ్వరకాలనీ,షీలానగర్, తుంగ్లాం,చుక్కవానిపాలెం నిర్వాసిత కాలనీల్లో మెగా ఫాగింగ్ చేపట్టారు. ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్ కుమార్ పర్యవేక్షణలో మలేరియా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ అప్పల రాజు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు 302

- కొలిక్కి వచ్చిన రేషనలైజేషన్
- కలెక్టర్‌కు ప్రతిపాదనలు
- ఈఆర్వో లక్ష్మారెడ్డి వెల్లడి


సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో లక్ష్మారెడ్డి

గాజువాక : గాజువాక నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ కొలిక్కి వచ్చింది. ప్రస్తుతం ఉన్న 305 పోలింగ్ కేంద్రాలకు గాను రేషనలైజేషన్‌లో భాగంగా కొన్ని కేంద్రాలను మెర్జ్ చేయడం, కొన్ని కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయడం తదితర ప్రతిపాదనల అనంతరం, నియోజకవర్గంలో తాజాగా మొత్తం 302 పోలింగ్ కేంద్రాలను నిర్ణయించినట్టు గాజువాక ఓటర్ల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి తెలిపారు. అఖిల పక్ష రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాల్లో 85 పోలింగ్ కేంద్రాలను మార్పు చేసేందుకు, 87 పోలింగ్ కేంద్రాల ప్రస్తుత పేర్లు మార్పు చేసేందుకు రాజకీయ పక్షాలు ఆమోదం తెలిపాయి. ఓటర్ల నమోదులో భాగంగా కొన్ని పోలింగ్ కేంద్రాలలో గరిష్ఠంగా 1500కు దాటి ఓట్లు నమోదు కావడంతో కొత్తగా ఏడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఈఆర్వో తెలిపారు. ఓట్లు కనిష్ఠంగా ఉన్న సుమారు పది పోలింగ్ కేంద్రాలను పక్క పోలింగ్ కేంద్రాల్లో మిళితం చేశారు. ఈ ప్రతిపాదనలపై రాజకీయ పక్షాల అనుమతితో జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదన పంపుతున్నట్లు పేర్కొన్నారు. ఇంటింటి సర్వేలో ఫారం 6, 7,8కు సంబంధించి 36,047 దరఖాస్తులు అందగా 34,578 దరఖాస్తులను ఆమోదించామని, 1469 దరఖాస్తులను తిరస్కరించామని వివరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, గాజువాక, పెదగంట్యాడ తహసీల్దార్లు పాల్‌కిరణ్, రమాదేవి, జీవీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.